క్లుప్తంగా

పంటల మార్పిడితో సత్ఫలితాలు

ప్రత్తిపాడు: పంటల మార్పిడితో బహుళ ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో మండల పరిధిలోని పెదగొట్టిపాడు, గనికపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు పంటసాగు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల ప్రాముఖ్యత, విత్తనాల ఎంపిక, కొనుగోళ్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.ఉషారాణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దోమకాటుతో మలేరియా వ్యాప్తి



ప్రత్తిపాడు: దోమకాటుతో మలేరియా వ్యాప్తి చెందుతుందని.. దోమలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు-2 సచివాలయం పరిధిలో ఆయన మంగళవారం పర్యటించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు నిలిచిన ప్రదేశాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించడంతో పాటు మడ్డి ఆయిల్ పిచికారీ చేయాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్టీ కాలనీలో మలేరియా అంతం-మన పంతం అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

ప్రత్తిపాడు: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. తిక్కిరెడ్డిపాలెం ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎస్ఆర్‌కేవీఎం కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన ఎంఈవో, సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్‌రావు, మాజీ జెడ్పీటీసీ డక్కుమళ్ల భాగ్యారావులు విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

పొన్నూరు: విద్యుత్ ఛార్జీలను తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డివిజన్ సూర్యఘర్ నోడల్ అధికారి టి.వి. తులసీరామ్ అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో సూర్యఘర్ లక్ష్యాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ వెంకటేశ్వరరావు, జేఏఓ ఎ.జగన్నాథం, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

ప్రత్తిపాడు: అర్ధరాత్రి ఇంటికి వెళ్లి దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. చినకోండ్రుపాడుకు చెందిన రాయి చిన కిట్టయ్య సోమవారం రాత్రి గ్రామంలోని ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ కిట్టయ్య, అతని సోదరుడు ఇద్దరూ యువకులతో కలిసి డ్యాన్సులు వేశారు. దీంతో కిట్టయ్యకు క్రాంతి అనే యువకుడికి మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి సమయంలో క్రాంతి మరో ఐదుగురు కలిసి కిట్టయ్య ఇంటి వద్దకు వెళ్లి అతనిపై దాడికి పాల్పడ్డారు. కిట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



చేబ్రోలు: చేబ్రోలు గ్రామ సచివాలయం -1లో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న మంచాల వెంకయ్య(60) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకయ్య ఆయన స్వగృహం వద్ద మరణించారు. వెంకయ్య భార్య మరియమ్మ గతేడాది మరణించారు. మృతుడు వెంకయ్యకు ఆరుగురు సంతానం ఉన్నారు. వీఆర్ఏ మృతి పట్ల తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు సంతాపం తెలియజేశారు.

బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక శ్రీనగర్ ఏడో వీధిలోని బాలసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో గణపతి పూజ, బాలసుబ్రమణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమం, పూర్ణాహుతి చేపట్టారు.

సైన్ బోర్డులకు నిర్లక్ష్యపు చెదలు!

- నామమాత్రంగా రహదారి వెంట సైన్ బోర్డులు
- రంగును కోల్పోయి కొన్ని.. ముళ్ల పొదల్లో మరికొన్ని
- పట్టించుకోని అధికారులు



పొదలు అల్లుకున్న ఐదవమైలు సమీపంలోని సైన్ బోర్డు

ప్రత్తిపాడు: రహదారి వెంట సూచనలు చూపుంచే సైన్ బోర్డులను నిర్లక్ష్యపు చెదలు వెంటాడుతున్నాయి. సరైన మార్గంలో ప్రయాణీకులు ప్రయాణించేందుకు ఏర్పాటు చేసే సూచిక చిహ్నాలు రంగులను కోల్పోతున్నాయి. గ్రామాల పేర్లు, రోడ్ సేఫ్టీ సూచనలు, ప్రమాద ఘంటికలను వాహనదారులకు తెలియజేసే ఈ కీలకమైన సైన్‌బోర్డుల నిర్వహణ పట్ల ఆర్అండ్‌బీ అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా రాత్రిళ్లు ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డులో పదుల సంఖ్యలో సైన్ బోర్డులు ఉన్నాయి. కానీ ఏటుకూరు మొదలు పుల్లడిగుంట, ఐదవమైలు, కుర్నూతల, కోయవారిపాలెం, బొర్రావారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు వరకు అనేక గ్రామాల సమీపంలో ఉన్న సైన్ బోర్డులు ముళ్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా మరికొన్ని చోట్ల అయితే బోర్డులపై ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలు రంగులు వెలిసిపోయి కనిపించడం లేదు. దీంతో ప్రయాణీకులు ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు.

బ్రిడ్జిల వద్ద రేకులు ఎగిరిపోయి..

గుంటూరు నుంచి ప్రత్తిపాడు వరకు సుమారు నాలుగు వరకు బ్రిడ్జిలు, లోలెవల్ చప్టాలు ఉన్నాయి. ఆయా చప్టాలు, బ్రిడ్జిల వద్ద ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు బ్రిడ్జిల మార్జిన్లు అర్థమయ్యేలా పసుపు రంగు బోర్డులు బ్రిడ్జికి నాలుగు వైపులా ఏర్పాటు చేస్తారు. ఆ బోర్డులు కొన్ని పూర్తిగా రంగు వెలసిపోగా.. మరి కొన్ని చోట్ల ఏకంగా ఇనుప రేకులు ఊడిపోయి కనిపిస్తున్నాయి. దీంతో వర్షాల వేళ ప్రయాణీకులు మార్జిన్లు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



ఏటుకూరులో పక్కకు పడిపోయిన సైన్ బోర్డు

నాలుగు జిల్లాలకు రాకపోకలు..

గుంటూరు-పర్చూరు రహదారి మీదుగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటాయి. కీలకమైన ఈ రోడ్డులో నిత్యం ఇతర ప్రాంతాల వారు ప్రయాణిస్తుంటారు. ఎక్కడ ఏ ప్రమాదం ఉంది.. ఎక్కడ బ్రిడ్జిలు, లోలెవల్ చప్టాలు ఉన్నాయి.. ఎక్కడ స్కూల్స్ ఉన్నాయి.. ఏ ఊరు.. ఏ ఊరి వద్ద ఉన్నాం.. వంటివి తెలుసుకునేందుకు కచ్చితంగా సైన్‌బోర్డులు కీలకం. కానీ ఆర్అండ్‌బీ అధికారులు సైన్‌బోర్డుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రమాద ఘంటికలు మోగే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైన్‌బోర్డులపై దృష్టి సారించాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.



బొర్రావారిపాలెం వద్ద పేరు లేని సైన్ బోర్డు

● రహదారులపై చెత్త.. దుర్వాసనే అంతా!



ప్రత్తిపాడు పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్య కార్మికులు సరిపడా ఉన్నప్పటికీ రోడ్ల వెంట ఉన్న చెత్త కుప్పలను సకాలంలో తొలగించలేకపోతున్నారు. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సిమెంటు రోడ్డులో ఇలా రోజుల తరబడి చెత్తను ఎత్తివేయకపోవడంతో కుప్పలుగా పేరుకుపోతుంది. దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇదే మార్గంలో వ్యవసాయశాఖ కార్యాలయం, ఎస్సీ బాలికల వసతి గృహం, హెల్త్ వెల్‌నెస్ సెంటరు, రైతు సేవా కేంద్రం ఉండటంతో ముక్కు మూసుకుని ప్రజలు ఆయా కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. పక్కనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఉండటంతో విద్యార్థులు సైతం ఈ చెత్త కుప్పలను దాటుకునే వెళుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – ప్రత్తిపాడు

మొబైల్ ఐసీటీసీ క్యాంప్ సేవలు

ప్రత్తిపాడు: రక్తపరీక్షలతో హెచ్ఐవీ వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని డీఆర్పీ ఎం.వాసుదేవరావు అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ పర్యవేక్షణలో మంగళవారం పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంలో (దిశ) చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో మొబైల్ ఐసీటీసీ క్యాంప్‌ను నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ షేక్ శందానిభాష హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎల్‌టీ కిరణ్ హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో ఎస్.ఆర్. ప్రసాద్, జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, సీహెచ్‌వో ఎస్.స్వాతి, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు మరియమ్మ, జ్యోతి, క్లస్టర్ లింక్ వర్కర్ షేక్ మైమున్నిసా పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా చెత్త తరలింపు



పొన్నూరు: పట్టణంలో చెత్త తరలింపు అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లపై సేకరించిన చెత్త, తొలగించిన చెట్లను ట్రాక్టర్‌లో తరలించే సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇష్టానుసారంగా ట్రాక్టర్లలో నిండుగా కంప చెట్లను వేసుకుని వెళుతుండడంతో అవి జారి రోడ్డుపై పడుతున్నాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ట్రాక్టర్ వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. చెత్త తరలింపులో ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణ కొరవడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తరలింపులో జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. నందివెలుగు రోడ్డులోని కూర్చున్న గాంధీ బొమ్మ వద్ద ముగ్గురు వ్యక్తులు సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 930 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువకుడు అదృశ్యంపై కేసు

ప్రత్తిపాడు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన గోరిశెట్టి వరకుమార్, వరలక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం మండలంలోని పార్వతీపురం గ్రామానికి వచ్చారు. అక్కడ చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు గోరిశెట్టి ప్రదీప్(21) కజికిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ప్రస్తుతం సెలవులు కావడంతో పార్వతీపురంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. తల్లిదండ్రులకు ఎంబీబీఎస్ చదివించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో సుమారు నెల రోజుల కిందట గుంటూరులోని హారిక కళాశాలలో ఫిజియోథెరపిస్టు కోర్సులో చేర్పించారు. అయితే కళాశాలకు 15 రోజులు సెలవులివ్వడంతో గత కొద్ది రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ ఉదయం ప్రదీప్ బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వాళ్లను, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. ప్రదీప్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అని వస్తుంది. దీంతో తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు.

హైస్కూల్ అభివృద్ధికి సమష్టిగా కృషి


గుంటూరు రూరల్: కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి మంజూరైన ఇంగ్లీషు మీడియం హైస్కూలును మంగళవారం ప్రారంభించారు. యూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్‌గా గ్రేడ్ చేసేందుకు కృషి చేసిన పెద్దలను గ్రామ ప్రజలు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి, పదో తరగతి విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని గ్రామ ప్రజలు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీని నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయులు రవికుమార్, ప్రకాశరావు, ప్రమీలా దేవి, రాజేశ్వరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ. 50లతో విదార్థులకు భోజనం ఎలా..!

హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు గోడపత్రిక ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: యుక్త వయస్సులో ఉన్న విద్యార్థులకు కేవలం రోజుకు 50 రూపాయలతో ఎటువంటి పౌష్టిక ఆహారాన్ని ఇవ్వగలమని బీపీ మండల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులు పౌష్టిక ఆహార లోపం వలన అనారోగ్యం పాలవుతూ చదువులపై దృష్టి పెట్టలేరని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం గుంటూరు ఆలా హాస్పిటల్‌లో 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం లాగా హాస్టల్ విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ వెంకట్ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు జి సురేష్, వెటర్నరీ యూనివర్సిటీ ఇంచార్జ్ జే.ఎజ్రా పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నాయకులు

నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.7.73 లక్షల మోసం

లక్ష్మీపురం: ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.7.73 లక్షలు రుణం తీసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట రోహిణి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పరసా సుజన్‌రాజు, 179.7 గ్రాముల నకిలీ బంగారాన్ని అరండల్‌పేట 10/1లోని ఇండెల్ మణీ లిమిటెడ్ ప్రైవేట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.7.73 లక్షల నగదు తీసుకున్నాడు. ఏప్రిల్ 5వ తేదీన బ్యాంక్‌కు సంబంధించిన ఆడిట్ నేపథ్యంలో నకిలీ బంగారాన్ని గుర్తించారు. దీంతో బ్యాంక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాంక్ ఏరియా మేనేజర్ సాంబశివరావు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై ముగిసిన వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఐక్యూఏసీ, క్లస్టర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై 5రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్.రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) న్యాయమూర్తి జి.రుక్మిణి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కోర్టులోని సమావేశ మందిరంలో పోలీసు, ఎక్సైజ్ పోలీసులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. కక్షిదారులు, నిందితులు రాజీపడడంతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, మనోవర్తి, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ వీరానాయక్, ఎస్సైలు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రుక్మిణి

బాబు మోసాలతో విసిగిపోతున్న ప్రజలు

పొన్నూరు: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బాబు మోసాలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రచురించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామని పలువురు నాయకులు అన్నారు. కార్యక్రమంలో చింతలపూడి మురళీకృష్ణ, రుద్రపాటి ఆదిశేషు, నాగేశ్వరరావు, షేక్ మౌలాలి, కొండమూడి సుధాకర్, దాసరి శ్రీను, దేవరకొండ గోపి, కూచిపూడి మరియరాణి, పాల్గొన్నారు.

చేబ్రోలు: జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని చేబ్రోలు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. పాత పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పుస్తకావిష్కరణ చేశారు. కూటమి ఏడాది పాలనలోఅభివృద్ధి చేయకపోగా, వారు చేసిన మోసాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, కొల్లి శేషిరెడ్డి, పల్లెపాటి కోటేశ్వరరావు, యానాం మమత, రాజు, విజయకుమార్, రేవంత్ అల్లం వెంకట్రావు, పోలేశ్వరరావు, అప్పిరెడ్డి, సందీప్, గోవాడ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

పాఠశాలలకు త్వరితగతిన యూనిఫాం అందించాలి

ప్రత్తిపాడు: పాఠశాలలకు వెంటనే యూనిఫాంలను పంపాలని ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ పి.పార్వతి ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు స్టాక్ పాయింట్‌ను రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పార్వతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ పాయింట్‌కు వెళ్లకుండా స్టాక్ పాయింట్‌లోనే యూనిఫాంలు ఉండటాన్ని గమనించారు. ఎందుకు యూనిఫాంలను పాఠశాలలకు పంపలేదని ఎంఈవో-2 జి.లీలారాణిని ఆమె ప్రశ్నించారు. బాలుర యూనిఫాంలు ఒక రోజు, బాలికల యూనిఫాంలు మరోరోజు వచ్చాయని అందుకే సరఫరా చేయలేదని ఎంఈవో-2 వివరించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ విషయాలను హెచ్ఎం అలీషాను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. వెంట సమగ్ర శిక్ష సీఎంవో డి.అనిల్‌కుమార్ ఉన్నారు.



యూనిఫాం పంపిణీనిపై ఎంఈవో-2ను ప్రశ్నిస్తున్న పార్వతి

ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన

పెదకాకాని: అమెరికా అండ చూసుకొని ఇజ్రాయిల్ ఇరాన్‌పై కూడా దాడులకు తెగబడటం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. పాలస్తీనా, ఇరాన్‌లపై అమెరికా పోద్బలంతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా సీపీఎం, సీపీఐ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రమైన పెదకాకాని సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించగా.. జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ కార్యక్రమంలో మాట్లాడారు. సీపీఎం నాయకులు కుక్కల రాఘవయ్య, ఉల్లంగుల శివయ్య, కె సత్యనారాయణ, ఎస్ నీలాంబరం, సీపీఐ నాయకులు మహిళా సమైక్య గుంటూరు జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, గ్రామ కార్యదర్శి డేవిడ్ రాజ్, దర్శి లింగారావు, గోపి సుబ్బారావు, ఆర్ శ్రీనివాసరావు, దుర్గ, సిహెచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

గుంటూరు రూరల్: పాలస్తీనాపై సామ్రాజ్యవాదుల సాయంతో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని సీపీఎం పార్టీ పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్ లో సీపీఎం ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, కన్నెగంటి చంద్రశేఖర్ రావు, షేక్ షమి, నల్లమోతు రాజేంద్ర, బాలాజీ, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ఘన స్వాగతం పలుకుదాం

గుంటూరు రూరల్: పల్నాడు జిల్లాకు రానున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తాడేపల్లిలో బయలుదేరి.. ఏటుకూరు బైపాస్‌లోని లాలుపురం రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డుకు దిగి వీబీపీ రోడ్డు పైనుంచి కేవీపీ కాలనీ, చుట్టుగుంట, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, నల్లపాడు, పేరేచర్ల, మేడికొండూరు మీదుగా సత్తెనపల్లి నియోజకవర్గం చేరుకుంటారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు జగనన్నకు ఘన స్వాగతం పలకాలని ఆయన కోరారు.

బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బీసీ హాస్టల్స్‌లలో విద్యార్థుల ఆకలి కేకలు పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో అన్ని బీసీ హాస్టల్స్‌కి తక్షణమే శాశ్వత భవనాలు నిర్మించాలని, బీసీ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు యు.నాగేశ్వరరావు, నాయకులు ప్రసన్నకుమార్, ఎజ్రా, వెంకట్, అనిల్, బ్రహ్మం, గురుప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు